అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

- వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు
- రహదారులకు మరమ్మతు పనులు ప్రారంభం



అమర్తలూరులో గ్రామస్తులతో మాట్లాడుతున్న అశోక్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

కూచిపూడి (వేమూరు): విజయవాడలో ఈ నెల 19న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు తెలిపారు. అమర్తలూరు మండలంలోని కూచిపూడి పార్టీ కార్యాలయంలో వేమూరు నియోజక వర్గ పార్టీ కార్యకర్తలతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచి పోయే అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం 3 గంటలకు ఆవిష్కరించడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమానికి వేమూరు నియోజక వర్గం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చేందుకు మండల పార్టీ అధ్యక్షులు బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. విగ్రహావిష్కరణ తర్వాత సామాజిక సమతా సంకల్ప సభ జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. అణగారిన వర్గాల అభివృద్ధి కోసం రచించిన రాజ్యాంగం కారణంగానే నేడు వారంతా రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందడం జరిగిందన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలో మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించడం జరిగిందన్నారు. భవిష్యత్ తరాలకు గుర్తుండేలా విగ్రహం ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు యలవర్తి సురేష్, బొల్లిముంత ఏడుకొండలు, అనప రెడ్డి రఘురామి రెడ్డి, సూర్యదేవర రామ కృష్ణ, కుర్రా శ్రీనివాసరరావు, జేసీఎస్ మండల కమిటీ అధ్యక్షులు బొట్టు మోషే, సుబ్బారావు, గుమ్మడి రవి రాజా, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

అమర్తలూరు(వేమూరు): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ విగ్రహం ప్రారంభానికి పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలి రావాలని వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు కోరారు. అమర్తలూరు మండల కేంద్రంలోని దళిత వాడల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ నెల 19వ తేదీన విగ్రహాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి నియోజక వర్గం నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. గ్రామంలో వైఎస్సార్ కాలనీల్లో రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని రోడ్లు వేయించాలని గ్రామస్తులు కోరారు. వెంటనే ఎంపీపీ రాపర్ల నరేంద్రతో మాట్లాడి మండల పరిషత్ నిధులతో రోడ్లు పనులు ప్రారంభించారు. దళిత వాడల్లో సమస్యలు తన దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి రోజు ఉదయం 7 గంటలకు దళితవాడల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసు కోవడం జరుగుతుందన్నారు. భట్టిప్రోలు మండలంలోని కొన్ని దళిత వాడల్లో పర్యటించి వారి సమస్యలు పరిష్కారం చేయడం జరిగిందన్నారు. వేమూరు నియోజక వర్గంలో దళితుల అభివృద్ధే ధ్యేయంగా పని చేయడం జరుగుతుందన్నారు. నియోజక వర్గంలోని ప్రధాన రోడ్లకు తాత్కాలికంగా మరమ్మతు పనులు చేయించడం జరుగుతుందని ఆయన గ్రామ ప్రజలకు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, గ్రామ సర్పంచ్ దేవర కొండ రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ



భట్టిప్రోలు: అయోధ్య రాముని అక్షింతలను ప్రతి ఇంటికి చేర్చాలని బాపట్ల జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ కోరారు. బుధవారం భట్టిప్రోలులోని రామాలయాల్లో అయోధ్య రాముని వద్ద నుంచి వచ్చిన అక్షింతలకు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్యలో రామ మందిరం భారతీయులకు గర్వకారణమని పేర్కొన్నారు. పురవీధులలో జై శ్రీరామ్ నినాదాలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. ప్రతి ఇంటికి స్వామి వారి ఫోటో, అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ చింతల మురళీకృష్ణ, పడమట వెంకటేశ్వరరావు, భజన సంఘం నిర్వాహకులు మందపాకల గురులక్ష్మి, దాసరి రాజారావు, కాటూరి మాణిక్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలకు స్పందన



ఐలవరం(భట్టిప్రోలు): కనుమ పండుగను పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం ఐలవరంలోని ప్రధాన సెంటర్‌లో చిన్నారులకు మంగళవారం రాత్రి ముగ్గుల పోటీలు, ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ గణపతి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందచేశారు. పోటీలలో మాచర్ల జాహ్నవి, మహాలక్ష్మి, మధులిక సాయి, షణ్ముఖ ప్రియ, నిత్య, కిరణ్మయిలు ప్రతిభ చూపారు. వీరికి నిర్వాహకుడు కల్లూరు సీతారామాంజనేయులు బహుమతులు అందజేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మేలు

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు దివి కిషోర్ కుమార్ సూచించారు. చినరావూరులోని సచివాలయం వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు వారి ఇంటి వద్దకే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో వీటిని ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. జనరల్ ఓపీ- 97, గైనకాలజీ -13, జనరల్ మెడిసిన్-58, అప్తమాలజీ -38 మందికి వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ పి ఉషారాణి, డాక్టర్ లిఖిత, డాక్టర్ టి.వినిల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

తెనాలిరూరల్: ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, ఆటో ఢీకొన్న ఘటనలో గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం... తెనాలి వైపు నుంచి మంగళవారం రాత్రి పొద్దుపోయాక నందివెలుగు ప్రధాన కూడలి వైపు వెళుతున్న ఆటోను ఎదురుగా వచ్చిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న కొలకలూరుకు చెందిన గుంటూరు వెంకాయమ్మ(68) తీవ్రంగా గాయపడగా, ఆటో డ్రైవర్ స్వల్ప గాయాలపాలయ్యాడు. వెంకాయమ్మను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ మార్కెట్ ఏరియలో ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి ఓ వ్యక్తి బుధవారం 10 క్వార్టర సీసాలు కొనుగోలు చేసి వెళుతుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు. నిందితుడిని కొల్లిపర మండలం అత్తోట గ్రామానికి చెందిన గిడుగు కోటేశ్వరరావుగా గుర్తించారు.

వాలీబాల్ పోటీల్లో వేజండ్ల హైస్కూల్ జట్టు ప్రతిభ



వేజండ్ల (చేబ్రోలు): వాలీబాల్ పోటీల్లో వేజండ్ల హైస్కూల్ బాలికల జట్టు ప్రతిభ చూపింది. సంక్రాంతి సంబరాల సందర్భంగా వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులో 14 నుంచి 16వ తేదీ వరకు రాష్ట్రస్థాయి మహిళల వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను గ్రామ పెద్దలు అభినందించారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

ముగిసిన మండల స్థాయి పోటీలు



పోటీల్లో గెలుపొందిన టీమ్ కెప్టెన్లకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్



షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న బాలికలు

కొల్లూరు : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలుగులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ఆసక్తికరంగా జరిగాయి. బుధవారం కొల్లూరు బాలురోన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీలలో భాగంగా ఫైనల్స్ పోటీలలో గెలుపు కోసం క్రీడాకారులు హోరాహోరీగా పోరాడారు. క్రికెట్ పురుషుల విభాగంలో దోనేపూడి-కొల్లూరు-2 జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో దోనేపూడి జట్టు అన్ని విభాగాలలో ఆధిక్యతను ప్రదర్శించి విజేతగా నిలిచింది. మహిళల విభాగంలో చినపులివర్రు జట్టు కొల్లూరు-3 జట్టుపై గెలుపొందింది. షటిల్ బ్యాడ్మింటన్‌లో పురుషుల విభాగంలో ఈపూరులంకపై కొల్లూరు-2 జట్టు విజయం సాధించగా, మహిళల విభాగంలో కొల్లూరు-1 జట్టు కొల్లూరు-3 జట్టుపై గెలుపొందింది. వాలీబాల్ పురుషుల విభాగంలో కొల్లూరు-3 జట్టు చినపులివర్రుపై విజయం సాధించగా, మహిళల విభాగంలో రావికంపాడు జట్టు దోనేపూడిపై గెలుపొందింది. కబడ్డీ పురుషుల విభాగంలో కొల్లూరు-1 జట్టు గాజుల్లంక జట్టుపై గెలుపొందగా, మహిళల విభాగంలో కొల్లూరు-3 జట్టు కొల్లూరు-1 జట్టుపై విజయం సాధించింది. ఖోఖో పురుషుల్లో రావికంపాడు జట్టు కొల్లూరు-3 జట్టుపై గెలుపొందగా, మహిళల విభాగంలో కొల్లూరు-1పై దోనేపూడి జట్టు విజయం సాధించింది. మండల స్థాయిలో నిర్వహించిన పోటీలు ముగియడంతో పాల్గొన్న క్రీడాకారుల్లో ఉత్తమ ప్రతిభ కనభ కనబర్చిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పోటీలలో గెలుపొందిన జట్లకు కొల్లూరు పీహెచ్‌సీ ఉద్యోగి యడమ హరికృష్ణ సమకూర్చిన బహుమతులను కొల్లూరు తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు అందజేశారు.

రేపల్లె రూరల్: ఆడుదాం ఆంధ్రా పోటీలు పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కొనసాగుతున్నాయి. పోటీలలో భాగంగా బుధవారం మండల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, వాలీబాల్ పోటీలు బాలికలు, బాలుర విభాగంలో వేర్వేరుగా సాగాయి. పోటీలను మున్సిపల్ కమిషనర్ విజయసారథి, సచివాలయ ఉద్యోగులు పర్యవేక్షించారు.

ప్రజారంజక పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యం

బాపట్ల జిల్లా అధ్యక్షుడు అంజిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న అంజిబాబు

బాపట్ల అర్బన్ : ప్రజారంజక పాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్‌పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు గంట అంజిబాబు అన్నారు. బుధవారం బాపట్ల పట్టణంలోని కాపు కల్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం అంజిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లాలోని ఆరు నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజి బాబు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో ప్రజారంజకమైన పాలన అంటే అది కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని అంజిబాబు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు మరిచిపోయారని మోదీ ప్రభుత్వం అందరినీ నమ్మించేందుకు ప్రయత్నం చేస్తున్నప్పటికీ ప్రతి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తుందన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో కేంద్రంలో రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే లక్ష్యంగా పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులంతా పనిచేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని సమష్టిగా గెలిపిద్దాం

ఎమ్మెల్సీ హనుమంతరావు, గంజి చిరంజీవి



మాట్లాడుతున్న గంజి చిరంజీవి వేదికపై ఎమ్మెల్యే హనుమంతరావు

దుగ్గిరాల(తాడేపల్లిరూరల్): నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపునకు సమష్టిగా పని చేయాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పార్టీ సమన్వయకర్త గంజి చిరంజీవి పిలుపునిచ్చారు. స్థానిక పసుపుమార్కెట్ యార్డులో వైఎస్సార్ సీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంచనా మేరకు పెత్తందార్లకు పేదలకు మధ్య యుద్ధం జరుగుతుందని చెప్పారు. మనందరం అప్రమత్తంగా ఉండి మంగళగిరి నియోజకవర్గంలో గెలిచి సీఎం వైఎస్ జగన్‌కు బహుమతిగా ఇద్దామని పేర్కొన్నారు. ఈ స్థానాన్ని బీసీ వర్గానికి కేటాయించడం ఎంతో గర్వకారణమని చెప్పారు. మొదటి నుంచి బీసీల పార్టీ, మాకు బీసీలంటే ప్రేమ అని కల్లబొల్లి కబుర్లు చెప్పే టీడీపీ నియోజకవర్గంలో ఓ పెత్తందారుడి ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెడుతోందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా టీడీపీతో పాటు ఇతర పార్టీలలో ఉన్న బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు ఆలోచించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.సంతోష రూపవాణి, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు వి.రజనీకాంత్, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.రత్నం, సర్పంచులు బాణావత్ ఖుషీబాయి, కె.పద్మావతి, ఉన్నం ఝూన్సీరాణి, వై. శ్రీచంద్ర దుర్గాభవాని, ఈ.రమేష్, కె.సుధారాణి, పి.మేరమ్మ, షేక్ అజీజున్, బి.శ్రీనివాసరెడ్డి, జి.గంగాధరరావు, ఎంపీటీసీలు సుమన్, సురేష్, పద్మావతి, జాలీబాయ్, సల్మ, వైఎస్సార్ సీపీ నాయకులు ఈమని ధర్మరత్నం, లోకేష్, నాగూర్, బాజీ, వెంకటరావు, ఫణీంద్ర పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక సలాం హోటల్ సెంటర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన ఓ వ్యక్తి కుటుంబానికి పార్టీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి అందజేసిన ఆర్థిక సహాయాన్ని పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్ అందజేశారు.

కొట్లాట నిందితులపై కేసు నమోదు

కొల్లూరు : సినీ థియేటర్‌లో చోటు చేసుకున్న కొట్లాటలో నిందితులపై కేసు నమోదు చేసినట్లు కొల్లూరు ఎస్ఐ జి. రాజ్యలక్ష్మి తెలిపారు. సోమవారం అర్ధరాత్రి కొల్లూరు వెంకటేశ్వర థియేటర్‌లో పరిమితికి మించి టికెట్లు అమ్మకాలు జరపడంతో ప్రేక్షకులకు కూర్చునే విషయంలో ఘర్షణ చోటుచేసుకొని కొట్లాటకు దారితీసిన విషయం విదితమే. కొట్లాటలో తీవ్రంగా గాయపడిన సుగ్గునలంకకు చెందిన సుగ్గున కేశవసాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొల్లూరు గౌడపాలెంకు చెందిన యేమినేని కాశీ కృష్ణతో పాటు, థియేటర్‌లోకి బయట నుంచి కర్రలు, కత్తులతో ప్రవేశించి దాడి చేసిన మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ప్రధాన నిందితుడైన కాశీకృష్ణను విచారించిన అనంతరం మిగిలిన నిందితులను గుర్తిస్తామని చెప్పారు.

పేకాట శిబిరంపై పోలీసు దాడులు

కొల్లూరు : పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించి జూదరులను అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొల్లూరు గౌడపాలెం సమీపంలోని పంట పొలాల్లో పేకాట నిర్వహిస్తున్నట్లు ముందస్తు సమాచారం అందడంతో ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి సిబ్బందితో కలసి దాడులు జరిపారు. పేకాట ఆడుతున్న 5గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 8,750 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తెనాలి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇళ్ల ముందు రాళ్లతో అవస్థలు



పొన్నూరు: పట్టణంలోని 5వ వార్డు నాలుగో లైనులో పది రోజుల కిందట సైడు కాల్వ నిర్మాణం కోసం అధికారులు పొక్లయినర్‌తో తవ్వకాలు చేపట్టారు. పనుల్ని పూర్తి చేయకుండా వదిలేయడంతో ఇళ్ల ముందు రాళ్లు అడ్డుగా ఉండి ఇబ్బందులు పడుతున్నామని నివాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులకు లిఖిత పూర్వకంగా విన్నవించినప్పటికీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి సైడు కాలువ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వైభవంగా జెండా పండుగ



పొన్నూరు: మండలంలోని జడవల్లిలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నూతన సంవత్సర జెండా పండుగ వేడుకను బుధవారం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొని వేడుకల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిల్లి ఇందిరా ప్రియదర్శిని, వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి మాణిక్యారావు, రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యులు షేక్ సైఫల్లా, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరావు, రూరల్ జేసీఎస్ కన్వీనర్ భవనం వంశీరెడ్డి, పొన్నూరు పట్టణ, రూరల్ అధ్యక్షులు మహమ్మద్, రుద్రపాటి ఆదిశేషులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న అమెరికన్ వైద్యులు

రేపల్లె రూరల్: స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఐఆర్‌ఈఎఫ్ అధినేత బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా అన్నారు. ఇండియన్ రూరల్ ఇవాంజిలికల్ ఫెలోషిప్ (ఐఆర్‌ఈఎఫ్) ఆధ్వర్యంలో మండలంలోని లంకెవానిదిబ్బ గ్రామంలో అమెరికన్ వైద్య బృంద సభ్యులచే బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తమ ఐఆర్‌ఈఎఫ్ సంస్థ ద్వారా ఇప్పటికే అనేక మంది పేదలకు ఉచితంగా గృహాలు నిర్మించి అందించామన్నారు. విద్యాసంస్థల ద్వారా వేల మందికి విద్యను, ఉచిత వైద్యశిబిరాల ద్వారా అనేక మందికి వైద్యసేవలు అందించటం జరిగిందన్నారు. విద్యార్థులకు సామాజిక స్పృహ కలిగించేందుకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించి సమాజ సేవా కార్యక్రమాలలో తమ విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నామన్నారు. భవిష్యత్‌లోనూ పేదలకు తమ సంస్థ అండగా నిలుస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా 20 మంది అమెరికన్ వైద్యులు పరిసర గ్రామాలలోని 500 మంది ఎస్టీలకు ఉచితంగా వైద్యసేవలు అందించారు. అనంతరం అవసరమైన వారికి మందులను ఇమ్మానుయేలు రెబ్బా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రవాసాంధ్రుడు జాన్ రెబ్బా, మండలి బైలీ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



నాటి గురువులతో విద్యార్థులు

పిట్టలవానిపాలెం: పిట్టలవానిపాలెం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1983-1985 మరియు 1985-1987 మధ్యకాలంలో ఇంటర్మీడియట్ చదువుకున్న 120 మంది విద్యార్థినీ విద్యార్థులు బుధవారం ఓ చోట కలుసుకున్నారు. మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో పాటు వివిధ దేశాలలో నివసిస్తున్న అప్పటి పూర్వ విద్యార్థులంతా హాజరయ్యారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు బాబూరావు, దుర్గాప్రసాద్, హనుమంతరావు, ప్రసాద్, కస్తూరి, సుబ్బరాజులను కార్యక్రమానికి ఆహ్వానించి వారి ఆశీర్వచనాలు పొందారు. గురువులను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమం నిర్వహణకు కృషి చేసిన శ్రీనివాసరెడ్డిని ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసరావు, పాండురంగారావు, నరసింహారెడ్డి, ఆంజనేయప్రసాద్, ఎంసీహెచ్ సుబ్బారెడ్డి, విజయ తదితరులు ఉన్నారు.

ప్రేక్షకులను అలరిస్తున్న నాటికలు



జరుగుతున్న కథ నాటికలోని సన్నివేశం

కొల్లిపర: సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని కొల్లిపరలోని అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలోని అన్నపరెడ్డి శివరామిరెడ్డి స్మారక కళాప్రాంగణంలో ప్రదర్శిస్తున్న నాటికలు అలరిస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన బుల్లితెర నటులు శాస్త్రి, మల్లాది భాస్కర్ ప్రదర్శించిన వెన్నెలొచ్చింది హాస్య నాటిక, గుంటూరు అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ ప్రదర్శించిన నాన్న నేనొచ్చేస్తా, తాడేపల్లి అరవింద ఆర్ట్స్ ప్రదర్శించిన జరుగుతున్న కథ నాటికలు ప్రేక్షకులను అలరించాయి. కళాకారులను శ్రీ కళానిలయం అధ్యక్షుడు జొన్నల అమ్మిరెడ్డి, కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఆరిమండ శివశంకర్‌రెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, జొన్నల శ్రీనివాసరెడ్డి, అన్నవరపు రమేష్, గ్రామ ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, కూరపాటి రవిశేఖర్‌రెడ్డి సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ కాంట్రాక్టర్ గుదిబండి చినవెంకటరెడ్డి, వంగా లక్ష్మారెడ్డి, బొల్లిముంత కృష్ణ, కల్లం వీరారెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, జొన్నల పేరెడ్డి, ఆరిమండ బసవకుటుంబరెడ్డి, బొంతు పోతిరెడ్డి పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రీసర్వే



సర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మార్వో సాంబశివ రావు, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు

గుంటూరు రూరల్: గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని గుంటూరు వెస్ట్ తహసీల్దార్ సాంబశివరావు తెలిపారు. మండలంలోని చిన్నపలకలూరులో బుధవారం పొలాల రీసర్వేను ఆయన జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ గ్రామాల్లో ఏళ్ల తరబడి రైతులు పడుతున్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి సమస్యకు ఇంటిముందే పరిష్కారం చూపిన ఏకైక నాయకుడు మన జగనన్న అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ సాంబశివరావు, వీఆర్వో ప్రసన్నకుమార్, గ్రామ సర్వేయర్లు శ్రీనివాస్, విజయ్‌కుమార్‌రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకానిలో బావిలో దూకి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. మంగళగిరి గణపతినగర్‌లో నివాసముంటున్న బిట్రా రమాదేవి(55) భర్త మస్తానరావు గతంలో మృతి చెందగా ముగ్గురు కుమార్తెలు. వివాహాలు అయి వెళ్లడంతో ఒంటరిగా ఉంటోంది. గత కొంతకాలంగా మతిస్థిమితం లేని రమాదేవి మంగళవారం రాత్రి చినకాకాని వెళ్లి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. బుధవారం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

గ్రామ అభివృద్ధిపై శిక్షణ తరగతులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని గ్రామ అభివృద్ధిపై బుధవారం వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఎంపీడీఓ దేవరపల్లి వీరయ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వీరయ్య మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో ఎంపీపీ డి.సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.అరుణ, దుగ్గిరాల మెడికల్ ఆఫీసర్ అబ్దుల్ రహమాన్, ఏపీఎం మహాలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నిర్మల, డీఈ రామకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుంచి పడి ఇద్దరు బాలురు గాయపడిన ఘటన మండలంలోని వేములూరిపాడులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రాహుల్, సన్నీని బైక్‌పై ఎక్కించుకొని గ్రామంలో తిరుగుతుండగా ప్రమాదవశాత్తు శివాలయం సమీపంలో రోడ్డుపై పడ్డారు. దీంతో రాహుల్‌కు తలపై, చేతులకు గాయాలయ్యాయి. సన్నీకి గాయాలు కావడంతో స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులను వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు చికిత్స కోసం తరలించారు.